క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి

పాలకొండ: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ఏలాం సెంటరులో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం నేరమని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు అందించిన వారిపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చిన్నారులకు రోగ నిరోధక టీకాలు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో చిన్నారులకు రోగ నిరోధక టీకాలు బుధవారం వేశారు. ఏఎన్‌ఎం కుమారి, ఎంపీహెచ్‌వో ఆర్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 0 నుంచి 5ఏళ్లలోపు చిన్నారులకు టీకాలు వేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన



అర్తాం రహదారి వద్ద మరమ్మతులు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

కొమరాడ: పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి గోతులమయం కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో బుధవారం అర్తాం గ్రామ సమీపంలో పెద్ద గొయ్యిని ఆర్ అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టగా పనులను కలెక్టర్ నిషాంత్‌కుమార్ పరిశీలించారు. పనులను నాణ్యతతో చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ



పాఠశాల రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఎంఈఓ జె.త్రినాథరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలుతీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించడం, ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ఎంతో కృషిచేస్తోందని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిందన్నారు. విద్యార్థులకు మంచి భోజనం, పాఠ్య పుస్తకాలు అందిస్తోందన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సేవలకు సత్కారం



ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావును సత్కరిస్తున్న ఎంఈఓలు

రామభద్రపురం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావును, రొంపల్లి క్లస్టర్ సీఆర్‌టీగా పనిచేసి బదిలీపై వెళ్లిన కె.చిన్నమ్మలను ఎంఈఓలు తిరుమలప్రసాద్, పెంటయ్య బుధవారం సత్కరించారు. విధి నిర్వహణలో భాగంగా వారు అందించిన సేవలను గుర్తించి సత్కరించారు. భవిష్యత్‌లో కూడా మరింత మెరుగ్గా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కొట్టక్కి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రావాడ భాస్కరరావు, సీఆర్పీలు బొప్పే సురేష్ కుమార్, ఎం.రవికుమార్, శ్రీనివాసరావు, వెంకటేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై నిఘా



రేగిడి: బూరాడ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగిడి, రాజాం సిటీ: గంజాయి, ఇతర నిషేధిత పదార్థాల తరలింపుపై అధికారులు ప్రత్యేక నిఘా వేశారు. మండలంలోని పారంపేట గ్రామానికి చెందిన ఓ విద్యార్థి గంజాయి తరలిస్తూ పట్టుబడిన విషయం విదితమే. అప్రమత్తమైన పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఎస్‌ఈబీ ఎస్పీ అస్మా ఫర్హీన్ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో బుధవారం బూరాడ, కొత్తపేట జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఈబీ ఎస్సై పిచ్చేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా ఆదివాసీ దినోత్సవం

ఆదివాసీ దినోత్సవం వేడుకగా జరిగింది. గిరిజన సంప్రదాయ నృత్యాలు నడుమ కనులపండువగా నిర్వహించారు. అడవితల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట
- ఎమ్మెల్యేలు కళావతి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి, చిత్రంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ విక్రాంత్, అధికారులు

సీతంపేట: ఐటీడీఏలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉన్న అడవితల్లి విగ్రహానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారితో కలిసి పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పాలాభిషేకం చేశారు. అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. కోడి, చీర సమర్పించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సందెమ్మ తల్లి గుడి వద్దకు గిరిజన సాంస్కృతిక నృత్యాలు చేస్తూ వెళ్లి అక్కడ పూజలు చేశారు. పీవో కల్పనాకుమారి గిరిజన మహిళ వేషాధారణలో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థినులతో నృత్యాలు చేస్తూ ఆద్యంతం అలరించారు. అనంతరం జీసీసీ, ఐసీడీఎస్, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, సవర ఆర్ట్స్ పెట్టిన స్టాల్స్ చూశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఎన్నో పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. వైద్యం కోసం స్థానికంగా సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. యువత అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. దీంతోనే టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ఈ ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. సీతంపేట వైటీసీ కేంద్రంగా నైపుణ్య కళాశాలను ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో ఉన్న 603 గ్రామాలను ఐదో షెడ్యూల్డ్‌లో చేర్చడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు.

గిరిజన జీవన ప్రమాణాల మెరుగుకు కృషి : ఎమ్మెల్సీ విక్రాంత్

గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మైదాన ప్రాంతాల వారికి దీటుగా అభివృద్ధి చేస్తుందన్నారు. గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిగా నియమించినందుకు మనందరం ప్రధానమంత్రి మోదీకి ధన్యవాదాలు తెలియజేయాలన్నారు.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఐటీడీఏలకు ఐఏఎస్‌లను నియమించారన్నారు. వచ్చే ఆగస్టు 9న అధికారికంగా ఇక్కడ ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరిపేలా చూడాలన్నారు.

గిరిజన హక్కుల రక్షణే లక్ష్యం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి

గిరిజనుల సంక్షేమం, వారి హక్కులను కాపాడడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. గిరిజన కుటుంబాలందరికి పోడు పట్టాలిస్తూ, వారికి రైతు భరోసా కల్పించిన ఘనత దక్కుతుందన్నారు. అందరిలాగే సమాన హోదా కల్పిస్తున్నారన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. గిరిజనులు స్వచ్ఛమైన వారని అభినందించారు. సమాజంలో సమానమైన హోదా కల్పించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. గిరిజనులు సామాన్యంగా బతుకుతారు ఉన్నతమైన ఆలోచనలు చేస్తారన్నారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్, ఎంపీపీలు బి.ఆదినారాయణ, డి.వెంకటరమణ, బి.బాను, జెడ్‌పీటీసీ ఎస్.లక్ష్మి, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, గిరిజన జేఏసీ నాయకులు బి.తేజేశ్వరరావు, ఎ.మన్మధరావు, కె.కాంతారావు, బి.సత్యారావు, జాన్ సింహాచలం, ఎస్.గంగారావు, ఎం.రామారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏవో హరికృష్ణ, పీహెచ్‌వో గణేష్, ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీడీ శ్రీనివాసరావు, జీసీసీ డీఎం సంధ్యారాణి, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకాబ్ దయానంద్, యాంకర్ పి.కోటిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.



అడవితల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కళావతి, పీవో కల్పనాకుమారి



ఉద్యానవన స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఐటీడీఏ పీవో కల్పనాకుమారి



గుమ్మలక్ష్మీపురం: ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నాయకులు



గిరిజన యువతతో నృత్యాలు చేసుకుంటూ ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే కళావతి, ఐటీడీఏ పీవో

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గిరిజన సంఘాల నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు అధిక సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులతో కలిసి ముందుగా గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట గ్రామాల్లో జై ఆదివాసీ అంటూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక హెచ్ గ్రౌండు, వైటీసీల్లో గిరిజనులంతా సంప్రదాయ వేషధారణలతో అలరించారు. డప్పువాయిద్యాలు వాయిస్తూ.. నృత్యాలు చేశారు.

యుద్ధాలతో వినాశనమే



ర్యాలీలో బిటివాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

వీరఘట్టం: ప్రపంచ యుద్ధాలతో వినాశనం తప్పదని బిటివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం సి.హెచ్ రత్నాకరరావు అన్నారు. బుధవారం హిరోషిమా, నాగసాకి డే సందర్భంగా పాఠశాలలో అణ్వాయుధ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై ఆగస్టు 6, 9 తేదీల్లో అమెరికా చేపట్టిన అణుబాంబుల దాడిలో ఈ పట్టణాలు ధ్వంసమయ్యాయని, ఈ విధ్వంసం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసిందని ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. అంతకు ముందు విద్యార్థులకు యుద్ధాల వల్ల కలిగే నష్టాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు జిల్లా సైన్సు అధికారి జి.లక్ష్మణరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

గరుగుబిల్లి: మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షించగలమని ఎంపీడీవో జి.పైడితల్లి అన్నారు. మండల కేంద్రంలో అమృత సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన చెరువు గట్టుపై బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చెరువు గట్టుపై పలు రకాల మొక్కలు నాటారు. నాటిన మొక్కల పరిరక్షణకు చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలన్నారు. సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, వైస్సార్ క్రాంతి పథం ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, ఉపాధి పథకం ఏపీవో ఎం.గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బూర్జ వెలుగు సీసీగా మరడాన కృష్ణ

సీతానగరం: మండలంలోని వెలుగు మండల సమాఖ్య బూర్జ సీసీగా మరడాన కృష్ణను నియమిస్తూ డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వచ్చాయని ఏపీఎం రెడ్డి శ్రీరాములు తెలియ జేశారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ బూర్జ సీసీగా ఇంతవరకూ సేవలందించిన కోటేశ్వరరావు మరో క్లస్టర్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో మరడాన కృష్ణ విధుల్లో చేరినట్లు తెలిపారు. సీసీ కృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సహకారంతో పొదుపు సంఘాల సభ్యులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందిచడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయ సిబ్బంది సీసీ కృష్ణను అభినందించారు.

నేల తల్లికి నమస్కారం



కురుపాం: మాజీ జవాన్లకు సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

కురుపాం: నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో కస్పా గదబవలసలో నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ మాజీ జవాన్లు పండా, ముస్కర్ల శ్రీనివాసరావులను సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత మాట్లాడుతూ నా భూమి – నా దేశం పరిరక్షణకు అందరం పాటుపడదామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీ సంతోషరాణి గౌడ్, టీపీఎస్ సోమయాజులు, జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ నిషార్, ఎంపీడీవో వీవీ శివరామప్ప, ఎంపీటీసీ బంగారునాయుడు, సర్పంచ్ గొర్ల సుజాత తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సన్మానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామ సచివాలయం వద్ద నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సర్పంచ్ మండంగి జగ్గారావు గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్లకు దుశ్శాలువాలతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూమి తల్లికి వందనం

భామిని: మండలంలో నా భూమి – నా దేశం కార్యక్రమంలో భాగంగా నేల తల్లికి వందనం చేశారు. ఎంపీడీవో జి.చంద్రరావు, ఉపాధి ఏపీవో తులసీదాస్, ఈవోపీఆర్‌డీ జి.కృష్ణారావు పర్యవేక్షణలో నా భూమి – నా దేశం శిలా ఫలకాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. నేల తల్లిని కాపాడుకోవాల్సిన బాధ్యతను వివరించారు. బిల్లుమడలో సర్పంచ్ శిగడాన రాధాకృష్ణ ఆధ్వర్యంలో భూ మాతకు పూజలు చేశారు. బత్తిలి, మనుమకొండ, కాట్రగడ, వడ్డంగిలో శిలా ఫలకాలు ఆవిష్కరించారు. మొక్కలు నాటారు. ఈసీ రమణమూర్తి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : సీనియర్ సిటిజన్లకు సన్మానం



భామిని: బిల్లుమడలో శిలాఫలకం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



జియ్యమ్మవలస: పెదబుడ్డిడిలో మొక్కను నాటుతున్న గ్రామస్తులు

జియ్యమ్మవలసలో...

జియ్యమ్మవలస: నా భూమి – నా దేశం నినాదంతో ప్రతి గ్రామంలో శిలాఫలకాలతో స్వాతంత్య్ర సమర యోధులకు నివాళులర్పిద్దామని ఉపాధి హామీ ఏపీవో శ్రీనివాసరావు అన్నారు. అల్లువాడ, పెదబుడ్డిడి, దంగబద్ర గ్రామాల్లో నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం అనే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు.

ఫ్రెండ్లీ పోలీస్ సేవలు భేష్



అత్తికొత్తూరు కూడలి రోడ్డులో గోతులను కప్పించి సరి చేయిస్తున్న పోలీసులు

భామిని: మండలంలో బత్తిలి పోలీసులు చేపడుతున్న ఫ్రెండ్లీ పోలీస్ సేవలు ప్రజల మన్నలు పొందుతున్నాయి. మండలంలో బత్తిలి ఎస్‌ఐ యతిరాజుల అమ్మనరావు ఆధ్వర్యంలో గోతుల మయమై ప్రమాదాలకు కారణమవుతున్న ఏబీ రోడ్డు గోతులను బుధవారం పూడ్పించారు. ఇటీవల వచ్చిన పాలకొండ డీఎస్పీ ఎంవీ కృష్ణారావు సూచనల మేరకు రోడ్డులో పడిన గోతులను కప్పించారు. స్థానిక యువకుల సహకారంతో టిప్పర్లతో స్టోన్ డస్ట్‌తో గోతుల పూడ్చి రోలింగ్ చేయించారు. రోడ్డు గోతుల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు నివారించడంపై ప్రజలు అభినందిస్తున్నారు.

త్వరితగతిన సర్వే రాళ్ల ఏర్పాటు

- ఆర్డీఓ హేమలత



రెవెన్యూ అధికారులకు తగు సూచనలు చేస్తున్న ఆర్డీఓ హేమలత

పాచిపెంట: సర్వే పూర్తయిన భూములకు సర్వే రాళ్లు త్వరితగతిన ఏర్పాటు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత అన్నారు. జగనన్న భూరక్ష – భూహక్కు రీసర్వేలో భాగంగా పాచిపెంట మండలం గార్లవలస, కేసలి, ఆలూరు గ్రామాల్లో సర్వేరాళ్ల ఏర్పాటును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సర్వే రాళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంగం రాజశేఖర్, సర్వేయర్లు, రైతులు, పాల్గొన్నారు.

వ్యాధుల నిర్మూలనకే 'మిషన్ ఇంద్రధనస్సు'

కొమరాడ:



సోమినాయుడువలసలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ జగన్మోహనరావు

వ్యాధి నిరోధక టీకాల నిర్వహణను బలోపేతం చేసి తట్టు, రుబెల్లా తదితర వ్యాధులను పూర్తి స్థాయిలో నిర్మూలించడమే మిషన్ ఇంద్రధనస్సు ఉద్దేశమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని సోమినాయుడువలసలో మిషన్ ఇంద్రధనసు టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. టీకా అర్హుల జాబితా వివరాలు, ఏఏ టీకాలు వేశారో పరిశీలించారు. ఈ వివరాలను వైద్య ఆరోగ్య శాఖ కొత్తగా చేర్చిన యూవిన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. పూర్తి స్థాయి టీకాలు వేయబడిన పిల్లలకు టీకా ధ్రువపత్రాన్ని అందజేశారు. శనివారం వరకు మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయగౌడ్, ఏఎన్‌ఎం స్వాతిముత్యం, సీహెచ్‌వో జయంతి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

రైతుల కల్పతరువు.. వెంకమ్మ చెరువు



నిండుకుండలా ఉన్న వెంకమ్మ చెరువు

- ఏడాదికి మూడు పంటలు
- ఖరీఫ్‌లో 600 ఎకరాల్లో సాగు
- చెరువులో ఆక్రమణలు తొలగిస్తే పెరగనున్న సాగు విస్తీర్ణం

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌పీ రోడ్డులో మరియగిరి సమీపంలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులకు కల్పతరువుగా మారింది. ఖరీఫ్‌లో రైతులకు సాగు నీరందిస్తూ పంట పొలాలను సస్యశ్యామలం చేస్తోంది. ప్రస్తుతం వెంకమ్మపేట, జోగిమ్మపేట, చిదిమి, పాలమెట్ట రైతులు వెంకమ్మ చెరువు ఆయకట్టులో సుమారు 600 ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేస్తున్నారు. మండలంలో చాలా చోట్ల ఇంకా దమ్ములు అవుతున్నా... వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులు మూడు రోజుల క్రిందటే ఉభాలు పూర్తి చేసేశారు. ఉభాలు పూర్తి కావడంతో పుడమి తల్లికి పచ్చాని రంగేసినట్లు ఇక్కడ వాతావరణం అలరిస్తోంది.

ఇదీ పరిస్థితి

మండలంలో సుమారు 250 చెరువులు ఉన్నాయి. వీటిలో 70 శాతం ఆక్రమణలకు గురయ్యాయి. ఈ చెరువులు ఏ కాలంలో కూడా సాగుకు ఉపయోగపడటం లేదు. మిగిలిన 30 శాతం చెరువులు ఖరీఫ్‌లో వరి పంటకు నీరు అందిస్తున్నాయి. అయితే రబీలో మాత్రం సాగుకు నీరందించే పరిస్థితుల్లో ఈ చెరువులు లేవు. వెంకమ్మ చెరువు మాత్రం నిండు కుండలా అన్ని కాలాల్లోను ఉంటుంది. దీంతో ఏడాదంతా వెంకమ్మ చెరువు ఆయకట్టు సస్యశ్యామలంగా ఉంటోంది.

ఆక్రమణలు తొలగిస్తే మేలు

సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెంకమ్మ చెరువు వీరఘట్టం, చిదిమి పంచాయతీ పరిధిలో ఉంది. అయితే ప్రస్తుతం చెరువు 50 శాతం ఆక్రమణలకు గురై 100 ఎకరాలు ఉండవచ్చునని పలువురు వాపోతున్నారు. చెరువు ఆక్రమణలు తొలగిస్తే మరో 500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుందని రైతులు అంటున్నారు.



వెంకమ్మ చెరువు దిగువ భాగంలో పొలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

చెరువులో ఆక్రమణలు తొలగిస్తాం



ప్రస్తుతం చేపడుతున్న భూ సర్వే ద్వారా చెరువు గర్భాన్ని గుర్తిస్తాం. ఈ ఖరీఫ్ సీజన్ అయిపోయిన తర్వాత చెరువులో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపడతాం. చెరువు గర్భాలను ఎవరైనా ఆక్రమించుకుంటే శాఖాపరమైన చర్యలు చేపడతాం.

– చందక సత్యనారాయణ, తహసీల్దార్, వీరఘట్టం

వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ అమ్మఒడి

రామభద్రపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చేరిన విద్యార్థులకూ ప్రభుత్వం అమ్మఒడి పథకం మంజూరు చేస్తోందని ఏఎస్‌డబ్ల్యూఓ డీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక సాంఘిక బాలుర వసతి గృహాన్ని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహం ఆవరణం, మరుగుదొడ్లు, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో 5 ప్రీమెట్రిక్, 4 పోస్టుమెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయని, వాటిలో 20 నుంచి 30 వరకు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. కాస్మోటిక్ చార్జీలను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రతీరోజూ నాణ్యమైన భోజనంతో పాటు సాయంత్రం స్నాక్స్ కింద వివిధ రకాల తినిబండారాలు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాలకొండ / కురుపాం
9951602844, 9010204441
Office mail : vzmadvt@gmail.com